www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 29 సెప్టెంబర్ 2025

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - కడప

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సభాభవన్‌లో సోమవారం నిర్వహించనున్నామని డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీ పంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునని తెలిపారు. మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డిఆర్‌ఒ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునని తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మోడీని నిధుల కోసం ప్రశ్నించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - బద్వేలు

ప్రధానమంత్రి కర్నూలు జిల్లా పర్యటన కోసం రానున్న నేపథ్యంలో గతంలో రాష్ట్ర అభివృద్ధి కోసం ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రధానమంత్రిని కోరాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బద్వేల్‌లోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్రమోడీ జిఎస్‌టి తగ్గించామనే శుభవార్త చెప్పడానికి కర్నూలుకు వస్తున్నామని అంటున్నారని చెప్పారు. 30 శాతం జిఎస్‌టి ఎంచి అందులో 15 శాతం తగ్గించి గొప్ప ఘనకార్యం చేసినట్లు చెప్పుకోవడం సిగ్గు చేటని తెలిపారు. రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, కడప ఉక్కు నిర్మాణంపై గతంలో ఇచ్చిన వాగ్దానాలపై నిలదీయాలన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా రాష్ట్రానికి తీవ్రమైన ద్రోహం చేశారని వారు విమర్శించారు. తరతరాలుగా రైతులు, పేదలు సాగు చేసుకుంటున్న భూముల్ని సోలార్, హైవేలు, విమానాశ్రయాల పేరుపై లక్షల ఎకరాలు భూములు లాక్కుంటున్నారు 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయకుండాచ పునరావాసం కల్పించకుండా దాదాపు రెండు లక్షల భూమిని రాయలసీమలో గతంలో జగన్మోహన్ రెడ్డి, ఇప్పుడు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ముగ్గురు కలిసి అదాని అంబానీలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ప్రధానమంత్రి కర్నూలుకు వస్తున్న సందర్భంలోనైనా ప్రత్యేక హోదా, ప్యాకేజీ, కడప ఉక్కు కోసం ప్రశ్నించాలని లేదంటే కూటమి నుంచి బయటకు వచ్చి తమతోనైనా కలిసి పోరాడాలని పేర్కొన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి,శివకుమార్,వి, అన్వేష్ బద్వేల్ టౌన్ కార్యదర్శి కె.శ్రీనివాసులు జిల్లా కమిటీ సభ్యులు చాంద్ బాషా, గౌసియా బేగం, రేషన్ కార్డు మండల కార్యదర్శి రమణ గోపవరం మండల కార్యదర్శి నరసింహ, నాయకులు, చిన్ని, బాబు శివ,మోక్షమ్మా, ఖైరున్ బీ, అనంతమ్మ,కొండయ్య, దుర్గమ్మ, స్వప్న,చంద్ర, జయరాజ్, ఐదు మండలాల పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన మేటి రచయిత 'ఇమాం'

- డిఆర్‌ఒ ఎం.విశ్వేశ్వర నాయుడు

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు

ప్రజాశక్తి - కడప అర్బన్

నేటి సమాజానికి అవసరమైన, విలువైన అనేక అంశాలను తన 'సూక్తి సుధా లహరి' పుస్తకం ద్వారా అందించిన మేటి రచయిత కే.శే.డి.ఇమాం అని డిఆర్‌ఒ ఎం.విశ్వేశ్వర నాయుడు అన్నారు. కడప ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల రిటైర్డ్ తెలుగు అధ్యాపకులు కీ. శే. డి.ఇమామ్ రచించిన 'సూక్తి సుధా లహరి' అనే గ్రంథావిష్కరణ సభ కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలోఇమామ్ కుమారులు డి.రమేష్ బాబు, డి.రవి కుమార్, కుమార్తె డి.పద్మజ పర్యవేక్షణలో ఆదివారం ఉదయం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించారు. 'సూక్తి సుధా లహరి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం డిఆర్‌ఒ మాట్లాడుతూ ఇమాం వృత్తిరీత్యా అధ్యాపకుడు, సాహిత్యాన్ని బాగా అధ్యయనం చేసినవారు కావడం వల్ల సమాజంలోని వ్యక్తులు ఉన్నత వ్యక్తిత్వాన్ని రూపొందించుకోవడానికి అవసరమైన పలు విషయాలను సాహిత్యం ఆధారంగా నిక్షిప్తం చేసి గ్రంథాన్ని రాయడం విశేషమన్నారు. సభాధ్యక్షులు, కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఇమాం క్రమశిక్షణ, నిబద్ధత కలిగినవారన్నారు. రామాయణం, భారతం, భాగవతాలను చక్కగా అవగతం చేసుకొని 'సూక్తి సుధా లహరి' గ్రంథాన్ని రచించారంటూ అందులోని కొన్ని పద్యాలను ఉదాహరించారు. విశిష్ట అతిథి, ప్రసిద్ధ సైకాలజిస్ట్ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య మాట్లాడుతూ ఇమాం పద్ధతైన మనిషని, ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడే వ్యక్తిత్వం కలవారన్నారు. ఆయన రాసిన గ్రంథం చాలా సమగ్రంగా ఉందని, వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన లక్షణాలను అందులో సాహిత్యంతో సమ్మిళితం చేసి రూపొందించారన్నారు. పుస్తక సమీక్షకులు, ప్రముఖ సాహితీవేత్త, వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ 'సూక్తి సుధా లహరి' గ్రంథంలో వేదవ్యాసుడు మహాభారతం, విద్య ఔన్నత్యం, ధ్యానం, యోగాభ్యాసం, వేద వ్యాయం, నమ్మకం, సంకల్ప బలం, అపార్థం - అనర్థం మొదలైన 21 వ్యాసాలు ఉన్నాయన్నారు. ఆయా వ్యాసాల్లోని విషయాన్ని పరిచయం చేశారు. ఆయా వ్యాసాల విశిష్టతను పలు ఉదాహరణలతో వివరించారు. ఆత్మీయ అతిథి, మొల్ల సాహిత్య పీఠం వ్యవస్థాపకులు డాక్టర్ విద్వాన్ గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ ఇమాం సాహెబ్ రాసిన గ్రంథంలో భావితరాలకు పనికివచ్చే పలు విషయాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ గ్రంథం విద్యార్థులకు పాఠ్యగ్రంథంగా ఉండదగిందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల రిటైర్డ్ జువాలజీ అధ్యాపకులు డాక్టర్ ఎం.సి. వెంకట సుబ్బయ్య, రిటైర్డ్ తెలుగు అధ్యాపకులు డాక్టర్ కె.వెంకటసుబ్బయ్య, స్టెప్ రిటైర్డ్ సిఇఒ డాక్టర్ మలిరెడ్డి రామచంద్రారెడ్డి, ఇమాం కుటుంబ సభ్యులు, ప్రముఖులు గోవిందరెడ్డి, పుత్తా పుల్లారెడ్డి, శ్యామసుందర్ రెడ్డి, జానమద్ది విజయ భాస్కర్, రాజారెడ్డి, కొత్తపల్లి రామాంజనేయులు, కొండూరు జనార్దన రాజు, చెంచిరెడ్డి, సత్యనారాయణ, లక్ష్మణరావు, రమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసులు

ఉద్యోగుల ఇంటి స్థలాల మంజూరుకు కృషి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యోగుల ఇంటి స్థలాల మంజూరుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం కడప జిల్లా ఎన్‌జిఒ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ సర్వ సభ సమావేశం అధ్యక్షులు లెక్కల కొండారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి పి.నిత్య పూజయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు కొండారెడ్డి సంఘం అభివృద్ధికి కృషి చేశానని చెపుతూ జమా ఖర్చులు వివరించారు. సొసైటీకి అందరూ సహకరించాలని కోరారు. జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ డైరెక్టర్స్ అందరూ సహకరించాలని, అభివృద్ధి కి తోడుపడాలని, స్థలం రాని మిగిలిన 200 మంది సభ్యులకు రాష్ట్ర అధ్యక్షులు ఆలపర్తి విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ సహకారంతో కచ్చితంగా స్థలం సాధిస్తామన్నారు. 2 వేల సభ్యులకు స్థలాలు రాలేదని, వారికోసం 300 ఎకరాల భూమి చూశామని తెలిపారు. రాష్ట్ర సంఘం ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, అందరికి ఇంటి స్థలాలు వస్తాయని భరోసా ఇచ్చారు. సమా వేశంలో సొసైటీ పాలక వర్గ డైరెక్టర్స్ పి. శ్రీనివాసులు, వెంకటరెడ్డి, చిన్నయ్య, బాల మురళి, రాఘవరెడ్డి, నరసింహ, సుబ్బారెడ్డి, శివశంకరయ్య, జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, సహా అధ్యక్షులు తిమ్మారెడ్డి, జిల్లా నాయకులు బాల పుల్లయ్య, పొలిరెడ్డి సిద్దయ్య, రాజశేఖర్, పద్మనాభారావు, లక్ష్మీదేవి, సుహా సిని, నాగార్జున, తాలూకా అధ్యక్షులు, కార్యదర్శులు, మాజీ జిల్లా అధ్యక్షులు ఎస్.మునెయ్య, రిటైర్డ్ ఉద్యోగులు, సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కాళరాత్రి దేవిగా శ్రీవిజయదుర్గాదేవి

ప్రజాశక్తి - కడప అర్బన్ : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు కాళరాత్రి దేవిగా దర్శనమిచ్చారు. దుర్గామాత 7వ రూపం కాళరాత్రి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మూల నక్షత్రం రోజు అమ్మవారికి తెల్లవారుజామున 63 కళాశాలతో విశేష అభిషేకం నిర్వహించారు. యాగశాలలో చండీహోమం, శ్రీచక్రమండపంలో శ్రీచక్రార్చనలు ఆలయ అర్చకులు నిర్వహించారు. సాయంత్రం విశేష పూజలో భాగంగా (చదువుల తల్లి) సరస్వతి దేవి పూజ నిర్వహించారు. అమ్మవారు కాళరాత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ విజయదుర్గా మల్లికార్జునులు ఆలయ ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో ప్రదక్షిణ ముందు చిన్నారుల కోలాటం భక్తులను విశేషంగా ఆకర్షించింది.ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జున రావు, ఆలయ నిర్వాహకులు సుధా దుర్గాప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నేడు మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-కలసపాడు : స్వస్తి నారి సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా ఈనెల 29న మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శైలజ, డాక్టర్ సాయితేజ పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే కార్యక్రమానికి కీళ్ళు, ఎముకలు, స్త్రీ, చిన్నపిల్లలు, కంటి వైద్య నిపుణులు హాజరై పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. మండలంలోని మహిళలందరూ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



చైర్మన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే, టిడిపి అధ్యక్షులు

మృత్యుంజయకుంట ఆలయ చైర్మన్‌గా నాగేశ్వరరావు నాయుడు

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప నగరంలోని మృత్యుంజయ కుంటలో వెలసిన శ్రీ మృత్యుంజయ శ్వేర స్వామి శివాలయం ఆలయ చైర్మన్‌గా పల్లెనేని నాగేశ్వర రావు నాయుడు, కమిటీ సభ్యులు చింతల వెంకట రమణ నాయుడు, మరికొందరు కలిసి ఎమ్మెల్యే మాధవి, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆలయ ఆవరణంలో ఘనంగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ నాగేశ్వరరావు నాయుడు మాట్లాడుతూ పురాతన శివాలయానికి చైర్మన్‌గా తనను నియమించిన ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షునికి ధన్యవాదాలు తెలిపారు. దేవాలయ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించి పునర్నిర్మానానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు వెంకటరమణ నాయుడు మాట్లాడుతూ శివాలయం గుడి అభివృద్ధి చేయడంలో తనకు అవకాశం కల్పించిన నాయకులకు రుణపడి ఉంటానని చెప్పారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆలయ అభివృద్ధి నోచుకోలేదని తెలిపారు. అందుకే ఎన్నికలకు ముందే తాను గెలిస్తే ఆలయం అభివృద్ధి చేస్తానని మనసులో అనుకున్నాను కాబట్టి ఈ ఆలయం అభివృద్ధి కృషి చేస్తున్నానని చెప్పారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ శివాలయం త్వరలోనే తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. అనంతరం చైర్మన్ నాగేశ్వర రావునాయుడు కమిటీ సభ్యులు జిల్లా అధ్యక్షునికి, ఎమ్మెల్యేకి శాలువా కప్పి పూల బొకేతో అభినందించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ, పూజారులు, టిడిపి కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

శిల్పారామంలో దసరా సందడి

ప్రజాశక్తి- కడప అర్బన్

సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు

శిల్పారామంలో దసరా సందడి ప్రారంభమైంది. దసరా ఉత్సవాలులో భాగంగా శిల్పారామం జనసంద్రంగా మారింది. శిల్పారామం సాంస్కృతిక కళావేదికపైన మిస్పా మూవీ పద్మాకర్ సహ కారంతో కడప అథ్లెట్స్‌కు చెందిన ఎయం డ్యాన్స్ అకాడమీ విద్యార్థి, విద్యార్థులు తమ పల్లె జానపదాలు, శాస్త్రీయనృత్యాలు, సినీ నృత్యాలతలతో ప్రేక్షకులను హోరెత్తించాయి. తమ ఆనందం ప్రేక్షకులు చప్పట్ల రూపంలో తెలిపారు. ఈ సందర్భంగా శిల్పారామం పరిపాలన అధికారి ఎస్.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ దసరా పండగ పర్వదిన సందర్భంగా ఈ నెల 30, అక్టోబర్ 2 తేదీలలో సంస్కృతిక కార్యక్రమాలలో ఉంటాయని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెలుగుజాతి దివ్యతేజం

గుర్రం జాషువా : యుటిఎఫ్

గుర్రం జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆధునికాంధ్ర సాహిత్య రంగంలో తొలి తరం కవుల్లో అన్ని విధాలా విలక్షణంగా ప్రసన్నమయ్యే మహనీయ మూర్తి గుర్రం జాషువా అని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు అన్నారు. గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని కడప యుటిఎఫ్ భవన్‌లో ఆదివారం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులమత విద్వేషాలు లేని కళారాజ్యం కోసం కలలుగన్న ఆశావాది, సమతావాది, మానవతావాది జాషువా అని ప్రశంసించారు. గుర్రం జాషువా 1895, సెప్టెంబర్ 28న గుంటూరు జిల్లా వినుకొండలో వీరయ్య, లింగమాంబ దంపతులకు జన్మించారని, కులం వల్ల బడిలో వేదిక ఎక్కి పద్యాలు చదివే అవకాశం లేకపోయినా, ప్రాథమికోపాధ్యాయునిగా ఉద్యోగం ప్రారంభించి బురదలో పుట్టిన కమలంలా వికసించి తెలుగు సాహిత్య చరిత్రలో తనకంటూ ఒక స్థానాన్ని పొందారని చెప్పారు. శాసనమండలి సభ్యులుగా సైతం పనిచేసి పేరు ప్రసిద్ధులు పొందారన్నారు. తన కవితా నైపుణ్యంతో ప్రజల నాలుకల మీద మాత్రమే కాక హృదయాలలో కూడా సజీవ ముద్ర వేసుకున్నాడన్నారు. సమాజంలో అసమానతలు కలిగినప్పుడు, అంటరానితనం విషం చిమ్మినప్పుడు,దుర్భర దారిద్ర్య పరిస్థితులు ఎదురైనప్పుడు జాషువా కవిత్వం జాగరూకత కల్పిస్తుందన్నారు. జాషువా రచనల సారాంశాన్ని అవగతం చేసుకొని నేటి సమాజాభివృద్ధికి కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి. రమణ, ఏజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, నాయకులు సుబ్బారెడ్డి,శివశంకర్, దేవదత్తం, కొండయ్య, గంగన్న, రామ కేశవ, ఎంవిఎస్ రాజు, ప్రకాష్ బాబు,శ్రీనివాసచారి, సుబ్బారావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనకై పోరాడిన 'విశ్వకవి జాషువా'

'గబ్బిలం' లాంటి రచనలతో సమసమాజ స్థాపనకై పోరాడిన విశ్వకవి 'గుర్రం జాషువా' అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ శివారెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఆదివారం నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా 131వ జయంతిని నిర్వహించింది. ముందుగా జాషువా చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ జాషువా సాహిత్యం పేదలు, పీడుతులు, కార్మికులు, కర్షకుల పక్షాణ నిలబడి ప్రశ్నించేలా ఉంటుందన్నారు. 'ఇచ్చోటనే' లాంటి పద్యాల్లో మనిషిలా సామాన్య జీవితం గడిపి మరణించకుండా తనకంటూ చరిత్రలో ఒకపుటను సంపాదించుకునేలా బతకాలన్న సందేశముందన్నారు. కఠిక పేదరికంలో పుట్టి శాసనమండలి సభ్యుడుగా ఎదిగిన జాషువా జీవితం నేటి యువతకు ఆదర్శమన్నారు. వైవీయూ పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ సమాజాన్ని సన్మార్గంలో పయనించేలా అభ్యుదయకోణంలో రచనలుచేసి 'నవయుగ కవిచక్రవర్తి'గా జాషువా కీర్తించబడ్డారన్నారు. సహాయ పరిశోధకులు డా.భూతపురి గోపాలకృష్ణశాస్త్రి మాట్లాడుతూ 1932లో పర్షియన్ చక్రవర్తి ఘజనీ మొహమ్మద్ ఆస్థానంలో ఉన్న కవి ఫిరదౌసి జీవితంపై ఫిరదౌసి కావ్యం వెలువరించారన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది, పుత్తా పుల్లారెడ్డి, పాఠకులు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని రామాంజనేయపురంలో 424/4సి, 425 సర్వే నంబర్లలో 40 ఏళ్లుగా ఉన్న వంకను పూడ్చి వేసిన వ్యక్తుల మీద క్రిమినల్ కేసు నమోదు చేయాలని సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆక్రమణకు గురైన వంకను సిపిఎం ప్రతినిధి బృందం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లుగా వస్తున్న వంకను మూసివేసి నీటి ప్రవాహాన్ని అడ్డుకున్నారని తెలిపారు. వంకకు అడ్డంగా కట్టిన గోడ పునాదిని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. వంక ప్రభుత్వ స్థలమని, ఆ స్థలం ప్రయివేట్ వ్యక్తులకు ఎలా కట్టబెట్టారని ప్రశ్నించారు. కొంతమంది నాయకులు యదేచ్ఛగా బరితెగించి ఆక్రమిస్తూ ఉంటే రెవెన్యూ, కార్పొరేషన్, ఇరిగేషన్ అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారని ఆరోపించారు. ఈ వంకను మూసి వేయడం వల్ల సెంట్రల్ జైలు, మహిళా పాలిటెక్నిక్, ఆర్‌సిఎంచర్చి, పోలీస్ క్వార్టర్లలోని ఇళ్లల్లోకి నీరు చేరుతుందన్నారు. పాత వంక ద్వారా సక్రమంగా నీటి ప్రవాహం కిందికి వెళ్లేలా చూడాలని, కబ్జాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దస్తగిరిరెడ్డి, చంద్రరెడ్డి, రామకృష్ణారెడ్డి, నరసింహ, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కవిత్వాన్ని వినిపిస్తున్న కవులు

ఘనంగా నాతియా మెహఫిల్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని గుంతబజార్ సర్కిల్ వద్ద వికాస్ సంస్థల అధినేత సుభాన్‌బాషా ఆధ్వర్యంలో జష్న్ యే మీలాదున్ నాతియా మెహఫిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారతదేశ వ్యాప్త కవులు నభీల్ బర్కతి, ఇమ్రాన్ బర్కతి, ఫర్హాన్ బర్కతి, షహజ్ ఆర్ఫీ పాల్గొని మహమ్మద్ ప్రవక్తను కొనియాడుతూ తమ కవిత్వాన్ని వినిపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాన్ బాష మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మదినం వేడుకల సందర్భంగా ప్రతియేటా ఈ నాతియా మేహిఫీల్ నిర్వహిస్తూ ఉన్నామని తెలిపారు. మహమ్మద్ ప్రవక్త నడిచిన శాంతి మార్గంలో ప్రతిఒక్కరు నడవలన్నారు. ఈ నాతియా మేహిఫీల్ ను విజయవంతం చేసిన నగర ప్రజలకు, పోలీసులకు, మున్సిపల్ అధికారుకు కృతజ్ఞతలను తెలిపారు.

గ్రామ కంఠం స్థలంలో సూచిక బోర్డు తొలగింపు

ప్రజాశక్తి-కాశినాయన

మండలంలోని కత్తెర గండ్ల పంచాయతీ చెన్నవరంలో కలెక్టర్, తహశీల్దార్ వెంకటసుబ్బయ్య ఆదేశాల మేరకు విఆర్‌ఒ నాయక్ ఆధ్వర్యంలో విఆర్‌ఎలు చెన్నయ్య, చిన్న చెన్నయ్య కత్తెర గండ్ల రెవెన్యూ పొలంలో గ్రామ కంఠం స్థలంలో ఆదివారం ఏర్పాటు చేస్తున్న సూచిక బోర్డును ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ మాబు, చెన్నవరం స్కూల్ వంట ఏజెన్సీ భర్త పోతగంటి ఖాజావలి, మునిరెడ్డి దశరథరామిరెడ్డి అడ్డుకున్నారు.ఈ సందర్భంగా విఆర్‌ఒ, గ్రామస్తులు మాట్లాడుతూ సర్వేనెంబర్ 1601, 1617 సర్వే నెంబర్ల పైకి నాలుగు ఎకరాల 19 సెంట్లు విస్తీర్ణం ఉందని, ఆ స్థలంలో తహశీల్దార్ ఆదేశాలతో సూచిక బోర్డు ను ఏర్పాటు చేస్తుంటే అడ్డుతగులుతున్నారని చెప్పారు. గ్రామంలో 75 దూదేకుల కుటుంబాలున్నాయని పేర్కొన్నారు. శ్మశా నం కోసం స్థలాన్ని అడిగితే రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని రజకు లు వాపోయారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి దూదేకుల శ్మశాన సమస్యను పరిష్క రించాలని కోరారు. సూచిక బోర్డు విషయమై తహశీ ల్దార్‌ను ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

సూచిక బోర్డును అడ్డుకుంటున్న ఫీల్డ్ అసిస్టెంట్, నాయకులు

బాలకృష్ణ వ్యాఖ్యలు సరికాదు : వైసిపి

ప్రజాశక్తి - కడప

శాసనసభలో బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై పవన్ కళ్యాణ్ ఎందుకు స్పందించలేదని మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా ప్రశ్నించారు. ప్రజల శ్రేయస్సును ఆలోచించకుండా బాలకృష్ణ జులాయిగా గౌరవప్రదమైన శాసనసభలో ప్రవర్తించడం సిగ్గుచేటు అన్నారు. ఆదివారం తన నివాస కార్యాలయంలో వైసిపి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కోసం రూపొందించిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి మోసం చేశారన్నారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని, కడపలోనూ కేసులు నమోదు చేశారు అన్నారు. అందుకే కార్యకర్తలు అభిమానులకు అండగా ఉండాలని భావించి డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ ప్రారంభించామని చెప్పారు.

ఎరువుల నిల్వకు ప్రాధాన్యత

బఫర్ లక్ష్యం 2,972 మెట్రిక్ టన్నులు
మార్క్‌ఫెడ్ మేనేజర్ ఎం.పరిమళజ్యోతి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ముఖా ముఖి..

జిల్లాలో రసాయనిక ఎరువులకు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో మార్క్‌ఫెడ్ క్రియాశీలంగా వ్యవహరిస్తోంది. జిల్లా రైతాంగ అవసరాలకు అనుగుణంగా రసాయనిక ఎరువుల సేకరణ, నిల్వలపై సీరియస్‌గా దృష్టి సారించింది. ప్రతిఏటా మార్క్‌ఫెడ్ రాష్ట్ర ఉన్నతాధికారులు ఎరువుల నిల్వ, సరఫరా నిర్వహణ నిమిత్తం టెండర్లు పిలుస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ప్రయివేటు వేర్ హౌసింగ్ సర్వీసెస్ కాంట్రాక్టు సంస్థకు ఎరువుల సేకరణ, నిల్వ, సరఫరా బాధ్యతలను కట్టబెడుతుంది. 2025 -26 ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు చేరిన నేపథ్యంలో రబీ అవసరాలకు సరిపడా ఎరువులను నిల్వ ఉంచడంపై దృష్టి సారించాం. ఇందులో భాగంగా ఎరువుల కొనుగోలు, నిల్వ, సరఫరా వ్యవహారాలను నిర్వహించాల్సి ఉంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని 416 రైతు సేవా కేంద్రాలకు డిమాండ్‌ను బట్టి ఎరువులను సరఫరా చేస్తున్నామని మార్క్ ఫెడ్ అగ్రిఇన్‌పుట్ జిల్లా మేనేజర్ పరిమళజ్యోతితో ముఖాముఖి.

ఎరువుల నిల్వల గురించి చెప్పండి?

2025-26 సంవత్సరంలో 10,088 మెట్రిక్ టన్నుల నిల్వలున్నాయి. ఇందులో 9,003 టన్నుల మేర విక్రయించారు. దీంతో 1,084 మెట్రిక్ టన్నుల మేరకు నిల్వ ఉంది. ఇందులో 1,516 టన్నులు ఓపెనింగ్ బ్యాలెన్స్ ఉంది. 2,972 మెట్రిక్ టన్నుల యూరియా, డిఎపి, ఎన్‌పికె రకాల ఎరువుల నిల్వలున్నాయి. ఇందులో 908 మెట్రిక్ టన్నుల డిఎపి, 2,329 టన్నుల యూరియా, 405 టన్నుల కాంప్లెక్స్ ఎరువులను నిల్వచేశాం. వీటితో పాటు ఆర్ ఎస్‌కెల్లో 1,470 మెట్రిక్ టన్నులు, 2,972 మెట్రిక్ టన్నులు గోడౌన్లలో నిల్వ చేశాం.

ఎరువుల సేకరణ లక్ష్యం ఎంత?

2025-26 ఖరీఫ్‌లో 10,088 టన్నుల ఎరువుల క్రయ, విక్రయాలు సాగించడమే లక్ష్యం. ఈమేరకు 9,003 టన్నుల ఎరువులు విక్రయించాం. జిల్లాలోని బద్వేల్, జమ్మలమడుగు, కడప, కమలాపురం, ముద్దనూరు, మైదుకూరు, పోరుమామిళ్ల, పులివెందుల ప్రాంతాల్లోని 416 రైతు సేవా కేంద్రాలు, మూడు పైగా గోడౌన్లలో నిల్వ చేసి పంపిణీకి సిద్ధంగా ఉంచాం.

ఎరువుల నిల్వల నిర్వహణపై స్పందించండి?

ఎరువుల సేకరణ, నిల్వల పర్యవేక్షణకు నోడల్ ఏజెన్సీకి బాధ్యతలు అప్పగిస్తుంది. టెండరు దక్కించుకున్న అవంతి వేర్ హౌసింగ్ సర్వీసెస్ లిమిటెడ్ కాంట్రాక్టు సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తుంది. సదరు కాంట్రాక్టు సంస్థ ఎరువుల నిల్వ, సరఫరా ఏర్పాట్లు చేస్తుంది. ఎరువుల సేకరణ దగ్గర నుంచి నిల్వ చేయడం, సరఫరా వంటి అంశాలను మార్క్‌ఫెడ్ పర్య వేక్షణ తప్పని సరిగా ఉంటుంది.

గోడౌన్ల వివరాలు తెలపండి?

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మూడు గోడౌన్లున్నాయి. ఎస్టేట్ ఆవర ణంలో రెండు, సెంట్రల్‌జైల్ సమీపంలో ఒకటి ఉంది. ఎరువుల బోగీ నుంచి లారీల్లో గోడౌన్లకు తరలించాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్‌లో డిమాండ్ పెరిగితే జిల్లాలోని 36 మండలాలకు చెందిన 416 రైతు సేవా కేంద్రాలకు తరలిస్తాం.

బహుమతి అందజేస్తున్న ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి

ముగిసిన యంత్ర 2కె25 శిక్షణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల జెఎన్‌టియు కళాశాలలో మెకానికల్ విభాగానికి సంబంధించి మూడు రోజుల యంత్ర 2కె-25 జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. ముగింపుసభకు ముఖ్యఅతిధులుగా పి.శ్రీనివాసరెడ్డి, హర్షవర్ధన్, వి.అజయ్‌తేజా హాజరయ్యారు. సభలో కళాశాల మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి, ట్రైనర్స్ సాయి నాగార్జున, అబ్దుల్ ఖాదర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ పోటీలలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

సూపర్‌సిక్స్ సూపర్ హిట్ అనడం హాస్యాస్పదం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

సూపర్‌సిక్స్ హామీలు సూపర్ హిట్ అని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టిడిపి కూటమి ఇచ్చిన ప్రధాన హామీలు ఇంకా అమలుకు నోచుకోలేదన్నారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు ఇవ్వలేదన్నారు. ఒక్కో నిరుద్యోగికి 15 నెలల్లో కూటమి ప్రభుత్వం రూ.45వేలు ఎగ్గొట్టిందని చెప్పారు. రాష్ట్రంలో 20 లక్షల మంది నిరుద్యోగ యువత ఉన్నట్లు చెప్పారు. యువతను టిడిపి కూటమి ప్రభుత్వం నమ్మించి మోసగించిందని తులసిరెడ్డి విమర్శించారు. ఆడబిడ్డ నిధి కింద 19-59 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1,500 ఆర్థికసాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఇంత వరకు ఆ పథకం అడ్రస్ లేదన్నారు. రాష్ట్రంలో 1 కోటి 80 లక్షల మంది ఆడబిడ్డలు ఉన్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకు పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలని తులసిరెడ్డి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వాహనదారులూ.. జర జాగ్రత్త

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు మున్సిపల్ పరిధిలోని నారాపురంస్వామి దేవాలయం ముందుభాగాన వాటర్ ప్లాంట్‌కు మధ్యలో ఉన్న సిమెంట్ రోడ్లు మనిషి పట్టేలా నడిరోడ్డులో రంధ్రం పడింది. వాహనదారులు జాగ్రత్తగా ఉండకపోతే ప్రమా దం జరిగే అవకాశం ఉందని పలువురు పేర్కొం టున్నారు. ఈ దారిలో ఓ వైపు కుండా రామయ్య కూడలి, రామిరెడ్డి పల్లె మోటు, మరో వైపు పట్ట ణంలోకి నిత్యం దేవాల యానికి వస్తూంటారు. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, చిన్న పిల్లలు ఆదమరిస్తే అంతే.. ఎలాంటి ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి, గుంతను పూడ్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

యజమానులతో మాట్లాడుతున్న అర్బన్ సిఐ సీతారామిరెడ్డి

రాగివైరు అమ్మకానికి వస్తే సమాచారమివ్వాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఎవరైనా రాగి వైరు అమ్మకానికి తీసుకొస్తే పోలీసులకు సమాచారమివ్వాలని అర్బన్ సిఐ సీతారామిరెడ్డి షాపు యజమానులకు సూచించారు. స్థానిక సీఐ పట్టణ పరిధిలో ఉన్న గుజిలీ షాపు యాజమానులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో పలుచోట్ల పొలాల దగ్గర మోటర్ల వైర్లను దోచుకెళుతున్నారని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. దొంగలు ఎవరైనా రాగి వైరును అమ్మకానికి వస్తే వెంటనే సమా చారమివ్వాలని, కొనుగోలు చేస్తే ఆ షాపు యజమానిపై కేసు నమోదు చేస్తా మని హెచ్చరించారు. అనుమానితులు ఎవరైనా వస్తే పోలీసలుకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మల్లికారున్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటి వసతిలేక వృథాగా ఉన్న మరుగుదొడ్డి

నిరుపయోగంగా మరుగుదొడ్లు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కార్యాలయాలు సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి. గ్రామ సచి వాలయాల వ్యవస్థ ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా కనీస వసతులు మాత్రం సమకూర్చలేదు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని చెముల్లపల్లె గ్రామ సచివాలయం సమస్యలకు నిలయంగా మారింది. ఇక్కడ నిర్మించిన కార్యాలయ మరుగుదొడ్డి నీటి సదుపాయానికి నోచుకోక నిరుపయోగంగా ఉంది. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మహిళలు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్డిని నిర్మించినా ప్రయోజనం లేకుండా ఉంది. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు కార్యాలయానికి వచ్చే ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నీటి వసతి కల్పించి మరుగుదొడ్డిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరు తున్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు, మందులు పంపిణీ

ప్రజాశక్తి - వేముల

వేముల పిహెచ్‌సిలో వైద్య సిబ్బంది, టిడిపి నాయకులు

వేముల పిహెచ్‌సిలో ఆదివారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో డాక్టర్ శరణ్య మాట్లాడుతూ మహిళలకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి అవగాహనా కల్పించారు. అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి, వైద్య సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - వేంపల్లె

మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉంటుందని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ఖాజామొద్దీన్ సూచించారు. మండలంలోని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. మహిళల్లో వచ్చే పలు కేన్సర్ల గురించి అప్రమత్తంగా ఉండాలన్నారు. నిపుణులైన డాక్టర్లతో స్క్రీనింగ్ చేసి కేన్సర్‌ను ముందుగానే గుర్తించి చికిత్స తీసుకోవాలన్నారు. రక్తపోటు, షుగర్ వ్యాధి, గుండె జబ్బులపై కూడా శ్రద్ధ పెట్టాలని కోరారు. చిన్నపిల్లలకు టీకాలను సకాలంలో వేయించాలని సూచించారు. క్షయ వ్యాధి నివారణకు క్రమం తప్పకుండా మందులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సుభాషిణి, డాక్టర్ పృధ్వీకుమార్‌రెడ్డి, డాక్టర్ నిహారిక, డాక్టర్ శాంతి, సిహెచ్ఒ వెంకటరత్నం, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీవున్నిసా బేగం, ఎంపిహెచ్ఇఒ ఫక్రుద్దీన్, సూపర్‌వైజర్ అరుణకుమారి, అంకయ్య, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, సుభద్రమ్మ, పంగా సుబ్బారాయుడు, చాపాటి చిన్న గంగిరెడ్డి, పంచాయతీ సెక్రటరీ వీరాంజనేయులు, సిహెచ్ఒలు ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ఖాజా మొద్దీన్

విద్యార్థుల ప్రతిభను గుర్తించడం హర్షణీయం

రాంగోపాల్ రెడ్డిని ఆహ్వానిస్తున్న యుఎస్ఒ సభ్యులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

విద్యార్థుల ప్రతిభను గుర్తించడం హర్షణీయమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఇస్తా వేదికగా ఆదివారం 62వ ఆల్ ఇండియా చిల్డ్రన్స్ ఫెస్టివల్ ముగింపు కార్యక్రమానికి ఆయనను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పిల్లల్లో ప్రతిభను వెలికితీసి ప్రోత్సహిస్తున్న యుఎస్ఒ సంస్థకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్ మీనా జైన్, వైస్ ప్రెసిడెంట్ నిఖిల్ బూమ్రా, జాతీయ కౌన్సిల్ సభ్యుడు దాసరి భానుప్రకాష్ పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతి

తిరుపతి ఇస్కాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఆ సంస్థ దేవాలయాల ప్రధాన అర్చకులు గోవర్ధన్ విహారి దాస్, పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి హరీష్ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని కోరారు. పట్టణంలోని ఎమ్మెల్సీ నివాసంలో ఆదివారం ఆయనను కలిసి పట్టణంలో ఆలయ నిర్మాణాలకు స్థలం కేటాయించాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్సీ ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని తెలిపారు కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ పి.వి. కృష్ణారెడ్డికి ఉత్తమ సేవా పురస్కారం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పివి కృష్ణారెడ్డికి వెంకటలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్తమ సేవా పురస్కారం-2025 అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ కృష్ణారెడ్డి అధ్యాపకునిగా విద్యార్థులకు బోధనలోనే కాకుండా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా సమాజంలో పలు సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. ముఖ్యంగా ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాలు, జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొనడం, కళాశాలలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం, ఆరోగ్య శిబిరాలను నిర్వహించడం వంటి ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపట్టి విద్యార్థుల్లో సేవా భావాన్ని పెంపొందించారన్నారు. ఆయన చేసిన కృషిని గుర్తించి ఈ పురస్కారం అందించడం ఎంతో సంతోషకరమన్నారు. ఇది కళాశాల ప్రతిష్టను మరింత పెంచిందని ప్రిన్సిపల్ అభినందించారు. సహచర అధ్యాపకులు, విద్యార్థులు, డాక్టర్ కృష్ణారెడ్డికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

పి.వి.కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న వెంకటలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ సిబ్బంది

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యోగ, ఉపాధికి పోరాడదాం

భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యోగ, ఉపాధికి పోరాడదామని డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్ష, కార్యదర్శి మేరీ కుమార్, విశ్వనాథ్ తెలిపారు. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతి కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ యోధుడు షహీద్ భగత్‌సింగ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను మరిచిందని, రాష్ట్రానికి టోపీ పెట్టిందన్నారు. ఎపి అంటే కేవలం అమరావతి, పోలవరం కాదన్నారు. వెనుకబడిన రాయలసీమలో ఉపాధి పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. కడప ఉక్కు పరిశ్రమ ప్రారంభానికి చర్యలు చేపట్టాలన్నారు. యువతకు స్ఫూర్తి ప్రధాత అయిన యువకిశోరం షాహిద్ భగత్‌సింగ్ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రమేష్, మౌసిన్, ఇరాన్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ విగ్రహం ఏర్పాటు చేయాలి



జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగులో భగత్‌సింగ్ విగ్రహం ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి తులసీశ్వర్ యాదవ్ కోరారు. స్థానిక ఎన్జీవో కార్యాలయంలో ఆదివారం భగత్‌సింగ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. మహేష్, లోకేష్, శ్యామ్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ గొప్ప దేశభక్తుడు

వేంపల్లె : దేశం కోసం ఆత్మ బలిదానం చేసిన గొప్ప దేశభక్తుడు సర్దార్ భగత్‌సింగ్ అని పిసిసి అధికార ప్రతి నిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. భగత్ సింగ్ 118వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఆదివారం వేంపల్లెలో ఘ నంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ భగత్ సింగ్ జీవితం ప్రతి ఒక్కరికీ, ప్రత్యేకించి యువతకు ఆదర్శనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, అమ ర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, బండారు వెంక టేశు, చిన్నకోట్ల నాగరాజు, ఐచర్ రమణ, తోపిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

భగత్‌సింగ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎన్.తులసిరెడ్డి

నేటి యువతకు ఆదర్శనీయులు భగత్ సింగ్

బద్వేలు : దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే ఊరి కొయ్యను ముద్దాడిన ధీరుడు భగత్‌సింగ్ అని ఆయన స్ఫూర్తితో యువత ఉద్యోగ ఉపాధి కోసం పోరాడాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాహుల్ అన్నారు. ఆదివారం బద్వేల్ పట్టణంలోని బస్టాండ్ సర్కిల్‌లో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ యోధుడు షాహిద్ భగత్ సింగ్ అని పేర్కొన్నారు. జలియన్ వాలాబాగ్ ఉదంతం ఆయన జీవిత చరిత్రని మార్చేసిందని, రవి అస్తమించిన బ్రిటిష్ సామ్రాజ్యాన్ని సైతం గడగడలాడించినటువంటి వీరుడు భగత్ సింగ్ అన్నారు. ఆయన అనునిత్యం స్వేచ్ఛ స్వాతంత్ర్యం కోసం పరితపించేవాడని, మత సామరస్యాన్ని ఎక్కువ ప్రాధాన్యత నిచ్చేవాడన్నారు. ఆయన స్ఫూర్తితో విభజన హామీల సాధన కోసం ఉద్యోగ ఉపాధి హక్కుల కోసం యువత పోరుబాట పట్టాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ శాఖలలో ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను మరిచిందని ఏపీకి టోపీ పెట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని నిలదీసి హక్కుకు సాధించడంలో విఫలం చెందిందన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎస్.కె. ఆదిల్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అజయ్, డివైఎఫ్ఐ రూరల్ అధ్యక్షులు ముడమాల ఓబుల్ రెడ్డి, పట్టణ నాయకులు ఎస్కే ఫయాజ్, శ్రీనివాసులు, మౌలాలి, నరసింహ పాల్గొన్నారు.

కూటమి పాలనలో ఆగిన అభివృద్ధి పనులు

బాలికల పాఠశాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు పూర్తి కావస్తున్నా అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో వైసిపి డిజిటల్ బుక్‌కు సంబంధించిన స్కానింగ్ పత్రాలను ఆవిష్కరించారు. అనంతరం అనకుంటలో నిర్మాణానికి నోచుకోని బాలికల పాఠశాల భవనాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మైదుకూరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇరుకుగా ఉందని, బాలికల పాఠశాల ఏర్పాటు చేయించి, సిబ్బందిని కూడా సమకూర్చామన్నారు. భవనాలు లేకపోతే అన్యాక్రాంతమయ్యే స్థలంలో బిల్డింగ్ నిర్మాణం చేపట్టి 70శాతం పూర్తి చేశామన్నారు. మిగిలి ఉన్న పనులను ఈ16 నెలల కాలంలో ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసి తగినంత సిబ్బంది, నిర్మాణానికి 5ఎకరాల భూమిని కేటా యించామన్నారు. శాశ్వత భవనం ఏర్పాటు చేయాలని కోరారు. బిల్డింగ్ కోసం నాబార్డు కింద రూ.34 కోట్ల 90 లక్షలు మంజూరై టెండర్లు పిలవ కుండా కాలయాపన చేస్తున్నారన్నారు. డిఎస్‌సి ప్రతి సంవత్సరం జరిగేదే దానికి విజయవాడకు పిలిచి హంగామా చేశారని ఎద్దేవా చేశారు. గత ప్రభు త్వంలో లక్షా నలభై వేల సచివాలయ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. పెన్షన్లు తమ వాలంటీర్లు ఇచ్చేవారని, నేడు ముఖ్యమంత్రి ఇస్తున్నారన్నారు. సోషల్ మీడియాపై కేసులు పెట్టి రెడ్ బుక్ రాజ్యాంగం నడుపుతున్నారన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని పేర్కొన్నారు. టైం వస్తే చేతులకు కూడా దొరకరన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వంద శాతం మళ్లీ జగన్ సీఎం అవుతారన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు లింగన్న, భరత్, షరీఫ్, జ్వాల, సుబ్బయ్య, సుబ్బరాయుడు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాజీ సిఎంపై అనుచిత వ్యాఖ్యలు సహించం

మదనపల్లె అర్బన్ : మాజీ సిఎం జగనన్నపై అనవసరపు వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని మదనపల్లి వైసిపి నాయకులు హెచ్చరించారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలోఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ మదనపల్లె మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లె మహేష్ బాబు, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, యువనాయకులు చరణ్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఎమ్మెల్యే బాలకృష్ణ సైకో గాడు, వాడు వీడు అంటూ ఏకవచనంతో సంబోధించడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమన్నారు. నందమూరి బాలకృష్ణ చరిత్ర అందరికీ తెలుసని పేర్కొన్నారు. విలువలు, విశ్వసనీయతకు జగన్ నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు.

బ్రహ్మంగారిమఠంలో బస్సు షెల్టర్‌లేక బరదలోనే వేచి ఉన్న ప్రయాణికులు

బస్సు షెల్టర్‌లేక ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు తిప్పలు తప్పడంలేదు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి బస్ షెల్టర్‌లేక అగచాట్లు పడుతున్నారు. ఎండకు, వానకు వారు తీవ్ర మాన సిక ఆందోళనకు గురవుతున్నారు. భక్తులు ఇబ్బందులు పడ్డారు. స్వామి దర్శనానం తరం, చూడవలసిన ప్రదే శాలు చూసిన తర్వాత వారి గమ్యస్థానాలకు వెళ్లేం దుకు బస్టాండ్ రాగా, అక్కడ షెల్టర్ లేక బురదలోనే తమ బ్యాగులతో ఉం డాల్సిన వచ్చింది. పాలకులు మరుతున్నా మఠంలో బస్ షెల్టర్ ఏర్పాటు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలున్నాయి. జిల్లా, రాష్ట్రం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి బి.మఠానికి భక్తులు, పర్యాటకులు వస్తుంటారు.

5న ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అక్టోబర్ 5న ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు అవార్డు టీచర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు రమణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సంస్కృతి సేవా సంస్థతోపాటు అవార్డు టీచర్స్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందినవారికి ఆత్మీయ సత్కార సన్మాన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2025 స్వీకరించిన ఉపా ధ్యాయులందరూ సన్మాన సభకు హాజరుకావాలని కోరారు. అదనపు సమాచారాన్ని 94405 07133, 79812 87980నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గ్రామబాట కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రైతు నాయకులు

రైతు కోసం 1నుంచి గ్రామబాట

ప్రజాశక్తి - దువ్వూరు

అక్టోబర్ 1నుంచి రైతు కోసం గ్రామబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎవి రమణ తెలిపారు. రైతు సేవా సమితి దువ్వూరు మండలశాఖ అధ్యక్షుడు కృష్ణయ్య ఆధ్వర్యంలో ఆదివారం స్థానికంగా కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారుపల్లి జగన్మోహన్‌రెడ్డి, రెడ్డి సంఘం సభ్యులు ఇరగంరెడ్డి శివారెడ్డి, ముడుమాల కొండారెడ్డి, జొన్నవరం సుబ్బారెడ్డి, నారుపల్లి లక్ష్మీనారాయణరెడ్డి, రైతు సేవా సమితి మైదుకూరు నియోజకవర్గ కార్యదర్శి మాడిశెట్టి సహదేవుడు, ఎక్స్ మిలటరీ మెన్ అంద్రోత్, రామచంద్రయ్య, అంద వెంకటపతి పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ బిల్లు వెనక్కి తీసుకోవాలి

మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

రాష్ట్రంలో ప్రవేశపెట్టిన ఎస్‌సి వర్గీకరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ పేర్కొన్నారు. ఆగస్టు 3న కుప్పం నుంచి మొదలైన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర ఆదివారం మదనపల్లికి చేరుకుంది. నిమ్మనపల్లె క్రాస్ వద్ద మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు యమలా సుదర్శన్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతర అంబేద్కర్ విగ్రహం వరకు రాజ్యాంగ పరిరక్షణ మహా పాదయాత్ర ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చింతామోహన్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు మాల మాదిగలను విభజించడం, పల్లెల్లో చిచ్చు పెట్టడం, సామాజిక న్యాయం అవుతుందా అని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు ఓ డైరెక్షన్ ఇస్తే దాన్ని అడ్డు పెట్టుకుని దళితులను విభజించడం దుర్మార్గపు చర్యని మండిపడ్డారు. ఎస్‌సి వర్గీకరణ ఒక్క పార్లమెంటుకు మాత్రమే ఉందని, ఎపి ప్రభుత్వం తెచ్చిన ఎస్‌సి వర్గీకరణ చెల్లదన్నారు. తమిళనాడులో ముఖ్యమంత్రి స్టాలిన్, కేరళలో, బిజెపి పాలిత ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఎస్‌సి వర్గీకరణ జరగలేదన్నారు. ఎస్‌సి వర్గీకరణ బిల్లును వెనక్కి తీసుకోకుంటే, చంద్రబాబు పాలనకు ఇదే చివరి రోజులని హెచ్చరించారు. ఎస్‌సి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశోక్ బాబు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు యమలా సుదర్శన్ మాట్లాడుతూ పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు 15శాతం నుంచి 20శాతం పెంచాలన్నారు. క్రిమిలేయర్ విధానాన్ని రద్దు చేసి, దళిత క్రిస్టియన్లకు ఎస్‌సి హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో దళిత సంఘాలు నాయకులు, విద్యార్థి, యువజన సంఘం, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన ఎఆర్ డ్యాన్స్ అకాడమీ

రాజంపేట అర్బన్ : హుయిన్ డ్యాన్స్ స్టూడియో వారి ఆధ్వర్యంలో కడప రథం నగరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి డ్యాన్స్ పోటీలలో రాజంపేటకు చెందిన ఎఆర్ డ్యాన్స్ అకాడమీ కళాకారులు జూనియర్స్ విభాగంలో సత్తా చాటి తృతీయ స్థానంలో నిలిచి రూ.15 వేలు నగదు బహుమతితో పాటు ట్రోఫీ అందుకున్నట్లు డ్యాన్స్ మాస్టర్ బొజ్జ అభిరామ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూవీ కొరియోగ్రాఫర్ యశ్వంత్ మాస్టర్, ఢీ కార్తీక్ మహారాజ్ చేతులు మీదుగా ట్రోఫీ అందుకోవడం గర్వకారణంగా ఉందని తెలిపారు. తనకు అండగా నిలిచి ప్రోత్సహించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, చెర్రీస్ అకాడమీ స్కూల్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించిన మాస్టర్ హరీష్ జానుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

వంతెన ఇలా.. ప్రమాదాలు జరిగితే ఎలా..!

ప్రజాశక్తి - ఖాజీపేట

ఇటీవల తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు వాహనదారుల నిర్లక్ష్యం వల్లనే కాదు అధికారుల నిర్లక్ష్యం వల్ల కూడానూ. ఆర్అండ్‌బి అధికారులు రహదారుల అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోకపోవడం వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే.. పత్తూరు సమీపంలోని బెస్త కాలనీ వద్ద కడపకు వెళ్లే ప్రధాన రహదారిపై నిర్మించిన వంతెనకు ఓవైపున రక్షణ గోడ పూర్తిగా దెబ్బతింది. ఈ మార్గంలో తరచూ ఉన్నతాధికారులు వెళ్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్త వహించినా లోతైన కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. పాఠశాలకు విద్యార్థులు సైకిళ్లపై వెళ్తుంటారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పత్తూరు వద్ద ప్రమాదకరంగా ఉన్న వంతెన